

22 నుంచి కేంద్ర జలశక్తి బృందం పర్యటన

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఈనెల 22 నుండి 24 వరకు జిల్లాలో కేంద్ర జలశక్తి బృందం సభ్యులు సచిద్ర కుమార్ పట్నాయక్, డాక్టర్ సోమరేంద్ర సింగ్ పర్యటన ఉందని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని డ్వామా అధికారులను జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కేంద్ర జలశక్తి బృందం సభ్యుల జిల్లా పర్యటన నేపథ్యంలో సంబంధిత శాఖలైన డ్వామా, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, భూగర్భ జలాలు, హార్టికల్చర్ సంబంధింత శాఖల అధికారులతో సమావేశమై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర జలశక్తి బృందం సభ్యుల పర్యటన నిమిత్తం రూట్ మ్యాప్‌ను సిద్ధం చేయాలని, డ్వామా ద్వారా చేపట్టే పనులతో పాటు ఇరిగేషన్ ఆర్‌డబ్ల్యూఎస్, సంబంధించిన పనులను గుర్తించాలన్నారు. ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు విజయ్ కుమార్‌రెడ్డి, శంకర్‌బాబు, డిడి గ్రౌండ్‌వాటర్ గోవర్ధన్ రెడ్డి, అడిషనల్ పీడీ ఉమావాణి, ఎపిడి సునీల్ కుమార్ పాల్గొన్నారు.

పేదల పెన్నిధి సుందరయ్య...!

ఆయన స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలి


సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు పిలుపు



పలమనేరులో సుందరయ్యకు నివాళి అర్పిస్తున్న సిపిఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జన పీడిత నేత పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని శుక్రవారం చిత్తూరు సిపిఎం జిల్లా కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈకార్యక్రమానికి సిపిఎం జిల్లా నాయకులు కె.సురేంద్రన్ అధ్యక్షతన వహించగా, ముఖ్యఅతిథిగా సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు హాజరై మాట్లాడారు. స్వాతంత్ర సమరయోధుడు, దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య దేశానికి ఓ ఆదర్శవంతమైన నాయకుడని కొనియాడారు. చదువుకుంటున్న సమయంలోనే బాల్యంలోనే దేశం కోసం పేద, బడుగు బలహీనవర్గాల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేసిన గొప్ప నాయకుడు అన్నారు. నేడు దేశం క్లిష్టపరిస్థితులు ఎదుర్కొంటున్నదని ఇలాంటి పరిస్థితుల్లో పుచ్చలపల్లి సుందరయ్యను ఆదర్శవంతంగా తీసుకొని మతోన్మాద బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు చైతన్య పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు బాలసుబ్రమణ్యం, రాజేష్, జ్యోతి, చిట్టెమ్మ, రాజశేఖర్, లోకనాథం పాల్గొన్నారు.

పలమనేరు: దక్షిణ భారత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి పలమనేరులో సిపిఎం పట్టణ కార్యదర్శి గిరిధర్ గుప్తా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు హాజరై పుచ్చలపల్లి సుందరయ్యకి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం దడాల సుబ్బారావు మాట్లాడుతూ సుందరయ్య లాంటి మహానేత భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ ఆయన జీవితకాలం అంతా పేదల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడని కొనియాడారు. పార్లమెంటుకు సైకిల్ పైన వెళ్లిన నిరాడంబరుడని, నిజాం నవాబు రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం లాంటి ప్రజాఉద్యమాలను ముందుండి నడిపించిన మహోన్నత నేత అనీ ఆయన ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కషి చేయాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయకార్మిక సంఘం కార్యదర్శి ఓబులరాజు మాట్లాడుతూ దేశంలో కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరనీ, దక్షిణ భారత దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఉద్యమానికి ఊపిరి పోసిన మహానేత అని ఆయనను స్ఫూర్తిగా తీసుకుని పోరాడాలని తెలిపారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈశ్వర, మహిళా సంఘం కార్యదర్శి భువనేశ్వరి, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ప్రకాష్, యుటిఎఫ్ సీనియర్ నాయకులు గురుమూర్తి శెట్టి భద్రయ్య, కెవిపిఎస్ నియోజకవర్గం నాయకులు పాకాల సుబ్రహ్మణ్యం, పలమనేరు మండలం నాయకులు గుర్రం సుబ్రహ్మణ్యం, ఎస్ఎఫ్ఐ నాయకురాలు యశస్విని, రాణి, జాహ్నవి, భవన నిర్మాణ కార్మికులు శ్రీరామయ్య సరోజమ్మ ధనమ్మ పాల్గొన్నారు.



పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నీళ్లతొట్టెను శుభ్రం చేస్తుండగా...

ముగ్గుర్ని బలిగొన్న విషవాయువు

- పరామర్శించిన మంత్రి పెద్దిరెడ్డి
- రూ.25 లక్షలివ్వాలని సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - పుంగనూరు: నీళ్లతొట్టెను శుభ్రం చేస్తుండగా విషవాయువు వల్ల ఊపిరాడక ముగ్గురు అక్కడికక్కడే బలైన ఘటన చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లి మండలం పెద్దకొండామర్రి గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. సంఘటన జరిగిన వెంటనే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బాధితులను పరామర్శించారు. 10లక్షలు నష్టపరిహారం అందిస్తామని ప్రకటించారు. మృతులంతా వ్యవసాయ కూలీలని, వీరి మృతితో వారి కుటుంబాలు వీధినపడ్డాయని 25 లక్షలు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.చైతన్య, ఉపాధ్యక్షులు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. వివరాలిలా ఉన్నాయి.

పెద్దకొండామర్రి గ్రామంలో వచ్చే వారం గంగజాతర జరగనుంది. ఈ జాతరకు అవసరమైన మంచినీటిని నిల్వ చేసుకునేందుకు గ్రామంలో నూతనంగా నిర్మించిన సంపు శుభ్రం చేసుకోవాలని గ్రామస్తులు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు వ్యవసాయ కూలి పనిచేసే అదే గ్రామానికి చెందిన రమణ (30), మునిరాజా (27), రవి (37), నాగభూషణరెడ్డి (40)లు సంపులో దిగారు. నాగభూషణ్‌రెడ్డి సంపు పై భాగంలో ఉండగా, రవి, మునిరాజా, రమణలు సంపులోకి దిగారు. అయితే సంపు లోపల విషవాయువు పీల్చడంతో ఊపిరాడక వారు అక్కడికక్కడే మృతిచెందారు. లోనికి దిగిన వారు పైకి రాకపోవడంతో నాగభూషణ్‌రెడ్డి కేకలు వేయడంతో గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకుని తొట్టెలో ఉన్న వారిని వెలుపలికి తీశారు. ముగ్గురు మృతిచెందగా, నాగభూషణ్‌రెడ్డి అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతులకు సంబంధించిన మూడు కుటుంబాలు ఈ ఘటనలో వీధినపడ్డాయి. విషయం తెలిసిన వెంటనే సిఐ మధుసూదన్‌రెడ్డి, ఎస్ఐ రవికుమార్‌లు ఘటనా స్థలానికి చేరుకుని సహాయ కార్యక్రమాలు చేపట్టారు. ఈ ఘటనతో పెద్దకొండామర్రి గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చౌడేపల్లి ప్రభుత్వ ఆస్పత్రి వద్ద బాధిత కుటుంబాలను పరామర్శించారు. పరిహారం కింద మృతుల కుటుంబాలకు ఐదు లక్షలు, వైఎస్ఆర్ బీమా పథకం కింద మరో ఐదు లక్షలు అందిస్తామని ప్రకటించారు. మంత్రితో పాటు చిత్తూరు పార్లమెంట్ సభ్యులు ఎన్.రెడ్డెప్ప, జడ్‌పిటిసి దామోదర్‌రాజు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి



ప్రమాదానికి కారణమైన నీటి సంపును పరిశీలిస్తున్న పోలీసులు



మృతులు, వారి ఫైల్‌ఫోటోలు



కూలీలకు 'ఉపాధి' కష్టాలు

- సమ్మర్ అలవెన్స్‌కు ఎసరు
- కనీస వసతులకు తిలోదకాలు
- రెండు పూటలా పని చేస్తేనే కూలి
- రోజంతా కష్టపడినా రూ.272లే..

రెక్కాడితే కానీ డొక్కాడని జీవితాలు ఉపాధి హామీ కూలీలవి. వారిని కేంద్ర ప్రభుత్వం రకరకాలుగా ఇబ్బంది పెడుతోంది.. ఒక్కపూట పనిచేసి ఇంటి దగ్గర వ్యవసాయ పనులు చేసుకునే వారిని రెండు పూటలా పనికి వస్తేనే కూలీ చెల్లిస్తామని, లేకుంటే లేదని చెబుతూ మానసికంగా హింసిస్తోంది. అంతేకాకుండా వేసవిలో అదనంగా ఇచ్చే సమ్మర్ అలవెన్స్‌కు కేంద్ర ప్రభుత్వం ఏసురు పెట్టింది. పనిప్రాంతాల్లో కల్పించాల్సిన కనీస వసతులకు తిలోదకాలు ఇచ్చింది. పనిముట్లకు డబ్బులు ఇవ్వకుండా వేధిస్తోంది. ఇలా రకరకాలుగా ఉపాధి హామీ కూలీలను ఇబ్బంది పెడుతుంది. వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతుండడంతో కూలీలకు రెండు పూటలా పనులకు వెళ్లాల్సిన నిబంధనలు కష్టంగా మారింది.

ప్రజాశక్తి- యాదమరి: చిత్తూరు జిల్లాలో కూలీలందరికీ సరిపడే వ్యవసాయ పనులు లేవు. దీంతో ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో 31 మండలాల్లో 2,51,981 కుటుంబాలకు జాబ్ కార్డులు ఇవ్వడం జరిగింది. ఇందులో 1,96,629 కుటుంబాలు అవసరాన్ని బట్టి ఉపాధి పనులకు హాజరవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధి కూలీలు 3,33414మంది ఉన్నారు. అందులో మహిళలు 182, 734 మంది ఉన్నారు. ఇందులో ఎస్సీలు 96,920 మంది ఎస్టీలు 1164 మంది బీసీ, ఓసీ ఇతరులు రెండు 2,25,330 ఉపాధి కూలీలు ఉన్నారు. ప్రస్తుతం జిల్లాలో 31 మండలాల్లో లక్ష మందికి ఉపాధి పనులు కల్పించాల్సి ఉండగా ప్రస్తుతం 63,153మంది రోజువారి పనులకు హాజరవుతున్నారు.

ఉపాధి హామీ పథకం కూలీలకు రెండు పూటలా అన్నం పెట్టేలా ఉండాలి. అయితే కేంద్ర ప్రభుత్వం ఆధార్ బేస్డ్ పేమెంట్ సిస్టం తీసుకురావడంతో కూలీలు ప్రతిరోజు రెండు పూటలా పనికి వెళ్లాల్సి వస్తుంది. దీంతో కూలీలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు సైతం ఉదయం మధ్యాహ్నం రెండు పూటలా పనికి వస్తేనే మీకు ఉపాధి కూలీ అందుతుందని లేకుంటే కూలీ డబ్బులు రావని చెబుతున్నారు. దీంతో ఉపాధి కూలీలు చేసేదేమీ లేక పొట్టకూటి కోసం రెండు పూటలా పనులు చేయాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

వేసవిలో సహజంగా తెల్లవారు జామునే పనులకు వెళ్లి ఒక పూట మాత్రమే పనులు చేయాల్సి ఉంది. అయితే కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధన నేషనల్ మస్టర్ మానిటరింగ్ సిస్టం అమలైనప్పటి నుండి రెండు పూటల ఉపాధి పనులు చేస్తేనే కూలీ డబ్బులు కూలీలకు అందుతుంది. రెండు పూటలా పనిచేసిన రోజుకు రూ.272లు మాత్రమే గిట్టుబాటు అవుతున్నది. సాధారణంగా పనిచేసే సమయం పెరిగినప్పుడు అదేస్థాయిలో ఉపాధి వేతనం పెరగాలి. అయితే ఉపాధి హామీ పథకంలో పనిభారం పెరిగింది...కానీ కూలీ పెరగడం లేదు గతంలో వస్తున్న విధంగానే వస్తుంది. అంతేకాదు కొన్ని ప్రాంతాల్లో దాని కన్నా తగ్గిపోయింది. ఇదివరకు ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలు ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు పని చేసేవారు. మధ్యాహ్నం పైన ఇంటి వద్ద సొంత పొలంలో వ్యవసాయం చేసుకునేవారు ఈవిధానం వారికి కొంత వెసులుబాటు ఉండేది. అయితే ఇప్పుడు మధ్యాహ్నం కూడా వచ్చి మూడు గంటల నుంచి ఉదయం ఎంత పని జరిగిందో సాయంత్రం వరకు అంతే పనిచేసినా కూలి మాత్రం అంతే వస్తుంది.

మండలాన్ని పరిశీలించినట్లయితే మార్చి ముందు యాదమరి మండలంలో పని చేస్తున్న కూలీలకు ఇదివరకు రూ.257లు వచ్చేది. 2023 మారికచ ఒకటవ తేదీ నుండి కేంద్రప్రభుత్వం 15 రూపాయలు అదనంగా వేతనం ఇస్తున్నది. ఇప్పుడు రెండు పూటలా పనిచేస్తే రూ.272లు.. రూ.15ల మాత్రమే పెరిగింది. పైగా ఇప్పుడు ఇంటి వద్ద పని చేసుకునే అవకాశం లేకుండాపోయింది. దీంతో చిన్న సన్నకారా రైతు కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధి పనులకు పోదామా వద్దా అని సందిగ్ధంలో పడుతున్నారు.

కనీస వసతులు కరువే..

చిత్తూరు జిల్లాలో 43డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉపాధి పథకంలో కూలీలకు కనీస సౌకర్యాలు ఇదివరకు అమలయ్యేవి వీటినింటి కేంద్ర ప్రభుత్వం ఎత్తేసింది. గతంలో మార్చి నుంచి జూన్ వరకు అదనంగా వేసవి కాలంలో 20 నుంచి 30శాతం అలవెన్సులు ఇచ్చేవి. అయితే దీనికి కేంద్ర ప్రభుత్వం కోత పెట్టింది. ఐదు కిలోమీటర్ల దాటి పనికి వెళ్తే రూ.20రూ అదనపు భత్యం ఇచ్చేవారు. దాన్ని తొలగించారు. పనిప్రదేశాల్లో మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కూలీలకు అందించేవారు. వీటిని కేంద్ర ప్రభుత్వం ఎత్తేసింది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల ప్రయోజనాలను క్రమంగా తగ్గించేస్తోంది. ఉపాధి పథకాన్ని ఉద్దేశపూర్వకంగా ఎత్తేసే కుట్రలో భాగంగానే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల ప్రయోజనాలను క్రమంగా తగ్గించేస్తుందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఉపాధి కూలి పెరగలేదు..

- శంకరయ్య, పాతపాలెం, యాదమరి మండలం

ఉపాధి పనులకు ఉదయం పూట 5 గంటలు సాయంత్రం 3 గంటలు పనిచేసినా కూలి మాత్రం పెరగడం లేదు. పైగా ఒక్కరోజు తగ్గిపోతుంది. మాకు కేటాయించిన పనిని మధ్యాహ్నానికి పూర్తిచేసి సాయంత్రం పూట ఊర్లో పని చేసుకునే వాళ్ళం. ఇప్పుడు అలా కుదరడం లేదు పని పెరిగిన కూలి మాత్రం అంతే వస్తుంది.

కూలి గిట్టుబాటు కావడం లేదు..

గుడిపాల మండలంలోని ముగరాలపల్లి, గెత్రాలమిట్ట, గ్రామాల్లో ఫిష్ పాండ్ పనులు ఉపాధి కూలీలు చేస్తున్నారు. ఎండలు అధికంగా ఉండడంతో నేల గట్టిబడి కూలి గిట్టుబాటు కావడం లేదని వాపోతున్నారు. రెండు పూటలా పనులు చేస్తున్న శ్రమకు తగిన వేతనం అందడం లేదు. ఒక్కపూటే పనులు కల్పిస్తే సౌకర్యంగా ఉంటుందని కూలీలు వాపోతున్నారు.

కూలీల సంఖ్య పెంచే విధంగా చర్యలు తీసుకుంటాం

- సుబ్రహ్మణ్యం, ఏపీడి, చిత్తూరు క్లస్టర్

ఎండలు విపరీతంగా పెరుగుతుండటంతో కూలీల సంఖ్య తగ్గింది. పండ్ల తోటలు రైతులకు ఉపయోగపడే పనులను కల్పించి గ్రామాల్లో ఉపాధి కూలీలతో అవగాహన కల్పించి వారికి అందుబాటులో ఉండే గ్రామాల్లో వారికి అవసరమైన పనులను కల్పించి కూలీల సంఖ్య పెంచే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కూలీలు పనిచేసే ప్రదేశాల్లో కనీస సౌకర్యాలైన నీరు, నీడ ఏర్పాట్లు చేస్తాం.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు



ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా ఉపాధి సంచాలకులు గంగాభవాని

బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోండి

ఎపిక్ కార్డుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి: కలెక్టర్




రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాజకీయ పార్టీలు వారి బూత్ లెవల్ ఏజెంట్ల నియామకం చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఓటరు జాబితాకు సంబంధించి అందిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, ఎపిక్ కార్డుకు ఆధార్ అనుసంధానం, తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు వారి బూత్ లెవల్ ఏజెంట్లను అపాయింట్మెంట్ చేసుకోవాలని, ఓటరు జాబితాకి సంబంధించి అందిన క్లెయిమ్‌లు, అభ్జెక్షన్లను పూర్తి చేసేందుకు, ఎపిక్ కార్డుకి ఆధార్ అనుసంధానం ప్రక్రియను పూర్తి చేసేందుకు రాజకీయపార్టీల ప్రతినిధులు సహకరించాలని అన్నారు. ఓటు హక్కు నమోదుకు సంబంధించి సంవత్సరానికి నాలుగు సార్లు సమ్మరీ రివిజన్ చేపట్టడం జరుగుతున్నదన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఓటరుగా నమోదు కావాలని ఈ విషయంలో రాజకీయ పార్టీలు అవగాహన పెంచాలన్నారు. ఓటు హక్కు పొందేందుకు భారత ఎన్నికల సంఘం నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన యాప్‌లపై అవగాహన పెంచుకోవాలన్నారు. సమావేశంలో డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి గంగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, బీఎస్పీ జిల్లా ఇంఛార్జ్ నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ తరపున పరదేశి , ఎలెక్షన్ సెల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో అప్రకటిత విద్యుత్ కోతలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్రంలో అప్రకటిత విద్యుత్ కోతలకు కారణం జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యమేనని తెలుగుదేశం నాయకులు దొరబాబు, సప్తగిరి ప్రసాద్ శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 7సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిన ఘనత జగన్‌కే దక్కుతుందని అన్నారు. రాష్ట్ర ప్రజల పైన 54వేల కోట్ల విద్యుత్ ఛార్జీల పేరుతో భారం మోపిన జగన్ ప్రభుత్వం తెలుగుదేశంపై అసత్యప్రచారం చేయడం మానుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటేష్ యాదవ్, జిల్లా వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు సునీల్ చౌదరి, జీడీ నెల్లూరు బీసీ సెల్ అధ్యక్షుడు జ్యోతి యాదవ్ పాల్గొన్నారు.

తూకాల్లో అవకతవకలకు పాల్పడితే కఠినచర్యలు




ర్యాంపు యజమానుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షన్మోహన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ర్యాంప్ యజమానులు తూకాల విషయంలో ఎలాంటి అవకతవకలకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ తెలిపారు. శుక్రవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ ఉద్యానవన శాఖ అధికారులు, ర్యాంప్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు, ర్యాంపు యజమానులు బాగుండాలని ఈదిశగా అందరూ సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే తోతాపురి మామిడి రకంను విక్రయించాలని తూకం, ధరల విషయంలో రాజీపడేది లేదని హెచ్చరించారు. తూకాల విషయంలో ఎలాంటి అవకతవకలకు పాల్పడిన కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని సంబంధిత ర్యాంప్‌లను సీజ్ చేయడం జరుగుతుందని అన్నారు. రైతులకు ఎలాంటి నష్టం రాకుండా చర్యలు తీసుకోవాలని, ర్యాంపులపై ధర్మా రెసిస్టెంట్ షీట్‌ను ఉపయోగించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారిని మధుసూదన్‌రెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. లీగల్ మెట్రాలజీ వారిచే అన్ని ర్యాంపుల వద్ద గల తూఖాలను తనిఖీ చేయాలన్నారు. సమావేశంలో ఉద్యానవన శాఖ అధికారులు ర్యాంపు యజమానులు రామ్ ఇన్చార్జులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు వందనం

8408 మందికి నగదు పురస్కారం : డిప్యూటీ సిఎం

100 మంది కారుణ్య నియామకం



వాలంటీర్లకు ప్రశంసాపత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సేవాతత్పరతతో పనిచేస్తున్న వాలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎక్సైజ్ శాఖ మంత్రి కె.నారాయణ స్వామి తెలిపారు. శుక్రవారం ఉదయం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్ రెడ్డి విజయవాడ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వాలంటీర్లుకు వందనం కార్యక్రమంను లాంఛనంగా ప్రారంభించగా వర్చువల్ విధానంలో జిల్లాస్థాయి కార్యక్రమం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రం నుండి వీక్షించే ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ... సేవాతత్పరతతో పనిచేస్తున్న వాలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని రాష్ట్ర ముఖ్యమంత్రి అందించే అన్ని సంక్షేమపథకాలు లబ్దిదారులకు చేరవేయడంలో వాలంటీర్లు ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని అన్నారు. రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక, భూగర్భ వనరులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ, వాలంటీర్ల వ్యవస్థ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలోచన నుంచి పుట్టినవేనని పేర్కొన్నారు. భారతదేశంలోని అన్ని రాష్ట్రాలు ఈవ్యవస్థల ద్వారా మన రాష్ట్రంలో సంక్షేమ పథకాను అమలు చేస్తున్న తీరును గొప్పగా కొనియాడుతున్నాయని తెలిపారు. ప్రతి 50ఇండ్లకు ఒక వాలంటీర్‌ను నియమించి కుల,మత, ప్రాంతాలకతీతంగా సంక్షేమ ఫలాలను అందించిన ఘనత మన ముఖ్యమంత్రికే దక్కుతుందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్దిదారులకు అందించడంలో ఉత్తమ ప్రతిభ కనపరచిన వారిని గుర్తించి ప్రతిఏటా సేవామిత్ర, సేవావజ్ర, సేవారత్న బిరుదాలతో పాటు సేవావజ్రకు రూ.30 వేలు, సేవారత్నకు రూ.20 వేలు, సేవామిత్రకు రూ.10 వేలు నగదు పురస్కారంతో ఇస్తూ వారిని సన్మానించడం జరుగుతున్నదని తెలిపారు. అర్హులకు లబ్ధిని చేకూర్చడంలో వీరు చేసిన సేవలను గుర్తించి ప్రభుత్వం వీరిని ఘనంగా సన్మానించడం జరుగుతున్నదని తెలిపారు. కారుణ్య నియామకాల కింద వివిధ ప్రభుత్వ విభాగాలలో వందమందికి నియామక పత్రాలను అందజేయడం సంతోషమని అన్నారు. గత మాసంలో కుప్పం నియోజకవర్గంలో 42మందికి ఇది వరకే కారుణ్య నియామక ఉద్యోగపత్రాలను అందజేయడం జరిగిందని తెలిపారు. జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివద్ధి సంక్షేమ పథకాలు వాలంటీర్ వ్యవస్థ ద్వారా మరింత పటిష్టంగా అమలవుతున్నదని తెలిపారు. వాలంటీర్లు అందిస్తున్న సేవలకు అర్హులుగా లబ్ధిపొందుతున్న వారి సంతప్తే ప్రత్యక్ష సాక్ష్యమని తెలిపారు. సామాజిక పెన్షన్లు అందించడంతో పాటు ప్రభుత్వం నిర్వహించిన పలు సర్వేలు, ఈకెవైసి వంటి వివిధ ప్రభుత్వ పథకాల లబ్ది గురించి లబ్దిదారులకు వివరిస్తూ వారికి పథకాలను చేరువ చేయడంలో ప్రధాన భూమిక పోస్తున్నారని ఇలాంటి మంచి పనికి తోడ్పడుతున్న వాలంటీర్‌లు, సచివాలయ సిబ్బందికి ప్రభుత్వం తరపున అభినందనలు తెలిపారు. జిల్లాకు సంబంధించి సేవావజ్ర కింద సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జ్, మెడల్స్‌తో పాటు రూ.30వేలు, సేవారత్నకు రూ.20 వేలు చొప్పున, సేవామిత్రకు రూ.10 వేలు చొప్పున మొత్తం 8408 మంది వాలంటీర్‌లకు నగదు పురస్కారంతో అందజేశారు. అలాగే కారుణ్య నియమకాల్లో భాగంగా వంద మందికి నియామక పత్రాలను మంత్రులు, కలెక్టర్ చేతుల మీదుగా అందజేసారు. ఈకార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘ మహిళలచే ఏర్పాటు చేసిన ఫుడ్‌ఎగ్జిబిషన్ అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎంఎల్‌ఏ ఆరణి శ్రీనివాసులు, నగర మేయర్ అముద, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, చిత్తూరు పార్లమెంట్ సభ్యులు ఎన్.రెడ్డప్ప, ఎంఎల్‌సి భరత్, డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్, జడ్పీ వైస్‌చైర్మన్ ధనుంజయ రెడ్డి, డిసిసిబి ఛైర్మన్ రెడ్డెమ్మ, రాష్ట్ర జానపద కళల అభివద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ కొండవీటి నాగభూషణం, పలమనేరు - కుప్పం - మదనపల్లె అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ వెంకట్‌రెడ్డి యాదవ్, జడ్పీ మహిళా స్థాయి సంఘ చైర్మన్ భారతి, జడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, నగర కమీషనర్ అరుణ, మెప్మా పిడి రాధమ్మ, ఆర్‌టిసి ఆర్‌ఎం జితేంద్రనాథ్ రెడ్డి, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి చిన్నారెడ్డి, డిపిఆర్‌సి జిల్లా కోఆర్డినేటర్ షణ్ముగరాం, చిత్తూరు పలమనేరు డిఎల్‌డిఓలు రవి కుమార్, ఉమావాణి, ట్రైనీడిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి



ప్రజాశక్తి–పుంగనూరు: నియోజకవర్గంలోని నేతిగుట్లపల్లి, ఆవులపల్లి రిజర్వాయర్లు, తంబళ్లపల్లి నియోజకవర్గంలోని ముదివేడు రిజర్వాయర్ పరిసర ప్రాంతాల్లో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ బీసీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ ఎం శ్రీకాంత్ డిమాండ్ చేశారు. స్థానిక రెడ్డమ్మ క్వార్టర్స్ వద్ద తెలుగుదేశం పార్టీ నాయకులు శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వైసీపీ నాయకులు గురువారం తెలుగుదేశం పార్టీని, నల్లారి కుటుంబాన్ని లక్ష్యం చేసుకుని విమర్శించడంపై తెలుగుదేశం పార్టీ దీన్ని తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేపడుతున్న రిజర్వాయర్లు జలయజ్ఞమా, ధనయజ్ఞమా, దోపిడీ యజ్ఞమా అనే విషయాన్ని ప్రజలకు చెప్పాలన్నారు. కేంద్రం నుంచి వివిధ శాఖల నుండి పొందవలసిన అనుమతులు పొందకపోవడంతో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చెన్నై బ్రాంచ్ రూ.100 కోట్ల జరిమానా విధిస్తే రాష్ట్ర ప్రభుత్వం దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టుకు వెళ్లడం జరిగిందన్నారు. దేశ సర్వోన్నత న్యాయస్థానం రూ.25 కోట్ల జరిమానా విధించి పనులు నిలుపుదల చేయాలని ఆదేశాలివ్వడం జరిగిందని తెలిపారు. మా ఇన్‌ఛార్జ్ చల్లా రామచంద్రారెడ్డి మండల పర్యటనలో భాగంగా రిజర్వాయర్లు నిర్మాణ ప్రాంతానికి వెళ్లగా అక్కడ రైతులు వారి కంట కన్నీరుతో బాధలను వెళ్ళగక్కారు. ఈ సందర్భంగా వారితో మా నేత మాట్లాడుతూ ఇక్కడ భూములు, ఇండ్లు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. దానిపై దశల వారి పోరాటం మేము చేస్తున్నామన్నారు. సమావేశంలో దేశాధి ప్రకాష్, సివి రెడ్డి, మాధవరెడ్డి, ఆసూరి బాలాజీ, కేశవమూర్తి, సుబ్రహ్మణ్యం రాజు, మాజీ సర్పంచ్ రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉద్యోగుల సర్వీస్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-పలమనేరు: ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు పలమనేరులోని దోర్నాల చెంగన్న వీధిలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు,పెన్షనర్స్ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎన్.సోమచంద్రా రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం యుటిఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి మాట్లాడుతూ 1998, 2008 డిఎస్‌సి (ఎంటిఎస్) టీచర్ల ఆత్మీయ సమావేశం, అభినందన సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా అధికారులు, పెన్షనర్లు పాల్గొంటారని కనుక ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, ఎంటిఎస్ టీచర్లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సంఘాలతో నిమిత్తం లేకుండా అందరూ హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లా ఖజానాధికారికి సత్కారం



ప్రజాశక్తి-పలమనేరు: జిల్లా ఖజానాధికారి ఎం.రామచంద్రను ఉప ఖజానా కార్యాలయం నందు పలమనేరు ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు కె.ఆనందబాబు ఆధ్వర్యంలో ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా డీటీఓ మాట్లాడుతూ ఉద్యోగులు ఆదాయపు పన్ను మినహాయింపులు ఇప్పటి నుంచే చెయ్యాలని తెలిపారు. విశ్రాంత ఉద్యోగులు ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. ఉద్యోగులకు చెందిన ఏ సమస్య అయినా సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం పలమనేరు ఎన్జీఓ నేత ఆనందబాబు మాట్లాడుతూ పలమనేరు ట్రెజరీ పరిధిలో సబ్ ట్రెజరీ అధికారి మునికష్ణ, ట్రెజరీ సిబ్బంది, ఉద్యోగులు ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులకు ఎటువంటి జాప్యం లేకుండా సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. ఎటువంటి సమస్యలున్నా సంఘం దష్టికి తెస్తే తప్పక పరిష్కారానికి కషి చేస్తామని జిల్లా ఎన్జీఓ సంఘం ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి యాదవ్ పేర్కొన్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ ప్రతి నెలా జరిపే సంఘం సమావేశంలో సమస్యలపై చర్చించి తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీఓ మునికష్ణ, ఉద్యోగులు రాజశేఖర్, బాబు జయ మనోహర్, విశ్రాంత ఉద్యోగులు గుణ శేఖర్, దేవా, సాంబయ్య, నారాయణ, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పాలసముద్రంలో 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి'



ప్రజాశక్తి-పాలసముద్రం: మండల పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఇదేమి కర్మ మన రాష్ట్రానికి ముగింపు కార్యక్రమ సభ, విలేకరుల సమావేశం జీడీ నెల్లూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ భీమనేని చిట్టిబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరు మండలాల రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు గ్రామ కమిటీ అధ్యక్షులు బాణాసంచాలు కాల్చుతూ పెద్ద ఎత్తున ర్యాలీగా స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్దకు వచ్చి ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి సేకరించిన వినతి పత్రాలను అందరి చేతుల మీదుగా బొలెరో వాహనానికి నింపి అక్కడి నుంచి చిత్తూరు పార్లమెంట్ కార్యాలయానికి ఆరు మండలాల నాయకుల సహాయ సహకారాలతో పెద్ద ఎత్తున వాహనాలతో ర్యాలీగా వెళ్లి చిత్తూరు పార్లమెంట్ కార్యాలయంలో ఈ వినతి పత్రాలను సమర్పించారు.

సిమెంట్ రోడ్ల నిర్మాణానికి సహకరించండి



ప్రజాశక్తి-రామకుప్పం: మండల కేంద్రం, మేజర్ గ్రామ పంచాయతీ అయిన రామకుప్పంలో కొత్తగా సిమెంట్ రోడ్లు వేయటానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ షన్మోహన్‌ను వైసీపి నేతలు కోరారు. శుక్రవారం ఎమ్మెల్సీ భరత్, స్థానిక వైసీపి నేతలు చిత్తూరులో కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా రామకుప్పంలోని పలు వీధులలో రోడ్డులు కంకర తేలిపోయి ఉండటంతో ప్రజలు రాక పోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, సమస్య పరిష్కారానికి సహకరించాలని ఎమ్మెల్సీ భరత్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఏళ్ల తరబడి నూతన రోడ్ల కోసం ప్రజలు నిరీక్షిస్తున్నరని, వర్షాకాలం సమీపిస్తుండటంతో వెంటనే పనులు చేపట్టేలా చూడాలన్నారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో రామకుప్పం వైసీపి మండల కన్వీనర్ బాబురెడ్డి, ఎంపిపి సుబ్రమణ్యం, సర్పంచ్ మురళి, అబ్దుల్, అప్పి, నారాయణస్వామి, కేశవ రెడ్డి, మంజునాథ రెడ్డి తదితరులు ఉన్నారు.

వైసీపీ పాలనలో కరెంటు ఛార్జీల బాదుడు

ప్రజాశక్తి-నగరి: వైసీపీ పాలనలో కరెం టు కోతలు, ఛార్జీల బాదుడు అధి కంగా వుందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ గాలి భాను ప్రకాష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో విద్యుత్ ఛార్జీలు పెంచి రూ.57,188 కోట్లు ప్రజలపై భారం మోపారన్నారు. ముందస్తు సమాచారం లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు కరెంట్ కోతలు విధిస్తూ ప్రజలని ఇబ్బంది పెడుతున్నారని, ఇప్పటికే 7 సార్లు కరెంటు ఛార్జీలు పెంచి ప్రజలపై మితిమీరిన భారం మోపారని గుర్తు చేశారు. జగన్‌మోహన్ రెడ్డి చేతగాని తనంతో విద్యుత్ రంగం సంక్షోభంలోకి వెళ్లిందన్నారు.చంద్రబాబు ప్రభుత్వం 10 వేల మెగావాట్ల అదనపు విద్యుత్ సామర్థ్యం పెంచారన్నారు. కరెంటు కోతల్లేకుండా నాణ్యమైమ విద్యుత్ అందించడం జరిగిందన్నారు.

అనుకూల దృక్పథం ఉంటే ఉన్నత స్థానాలకు

ప్రజాశక్తి-నగరి: అనుకూల దృక్పథం ఉంటే ఉన్నత స్థానాలకు ఎదగవచ్చని వ్యక్తిత్వ వికాస నిపుణులు రాజారామ్ కొల్లె అన్నారు. నగరి పట్టణంలో ఉచితంగా నిర్వహిస్తున్న పినాకా తరగతుల్లో భాగంగా శుక్రవారం విద్యార్థులకు ఆయన సలహాలు, సూచనలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనుకూల దక్పథం, ఆత్మవిశ్వాసం, ధైర్యం, స్థిరత్వం కలిగి ఉంటే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చున్నారు. ఉన్నత స్థానాలకు చేరుకున్న వారి ఏడు అలవాట్లు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన ఏర్పరిచారు. వాటిని జీవితానికి అన్వయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ బాలాజి, జనార్ధన్, సీడీ మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

మీడియాపై దాడి పత్రికా స్వేచ్ఛను హరించడమే..!

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మీడియా ప్రతినిధులపై వైసీపీ ఎంపీ అవినాష్‌రెడ్డి అనుచరుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు టిడిపి రాష్ట్ర కార్యదర్శి వెంకిటీల సురేంద్ర కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలియపరచాలని ప్రయత్నించిన మీడియా ప్రతినిధులపై దాడిచేసి వాహనం, కెమెరాలు ధ్వంసం చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. విధినిర్వహణలో ఉన్న మీడియా ప్రతినిధులపై దాడి చేసిన ఎంపీ అవినాష్ రెడ్డి అనుచరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'పేదల ఇంటి స్థలాన్ని వ్యతిరేకిస్తున్న చంద్రబాబు'



ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: అమరావతిలో పేదలకు సెంటు భూమి ఇంటి స్థలానికి ఇస్తే చంద్రబాబునాయుడు జీర్ణించుకోలేక వ్యతిరేకిస్తున్నారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కోటాగరం, కోటాగరం దళితవాడ, ఎట్టేరి, ఎట్టేరి దళితవాడలో డిప్యూటీ సీఎం పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదవాడికి అమరావతి పట్టణంలో ఒక సెంటు స్థలం ఇవ్వడం తప్పేంటని, పేదవాడికి ఉన్నవాడి సరసన ఇంటి పట్టా ఇస్తే ఆ సెంటు స్థలాన్ని శ్మశానంతో పోల్చడం చంద్రబాబుకు తగిన మాట కాదన్నారు. గత టిడిపి హయాంలో ఎక్కడైనా లేఅవుట్ వేసి పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారా అని ప్రశ్నించారు. ప్రజలు నిజాలు తెలుసుకుని రానున్న ఎన్నికల్లో మరోసారి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. సమావేశంలో ఎంపీపీ అనిత, ఎంపీడీఓ శ్రీదేవి తహశీల్దార్ ఇన్బనాధన్, కోటాగరం సర్పంచ్ లత, ఎంపిటిసి నీలమ్మ, వైసీపీ యువనేత చైతన్య రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ పూర్ణచంద్ర రెడ్డి, రైతు అధ్యక్షులు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నాం: మంత్రి



ప్రజాశక్తి- నగరి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నాలుగేళ్లుగా ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తూ వారికి అండగా నిలబడుతున్నామని, తెలుగుదేశం పార్టీలా ప్రజలను విస్మరించలేదని రాష్ట్ర పర్యాటక, సాంస్కతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధి 27వ వార్డు చింతపలట్టెడ దళితవాడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. స్థానికులు ఆమెకు హారతులు పట్టి, గజమాలు వేసి ఆహ్వానించారు. మంత్రి ఇంటింటికీ తిరిగి ప్రజాసమస్యలు, సంక్షేమ పథకాల అమలుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు ఆమె దృష్టికి తెచ్చిన సమస్యలకు సచివాలయ సిబ్బంది, సంబంధిత అధికారుల ద్వారా పరిష్కారమార్గం చూపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌ఛైర్మన్ బాలన్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకష్ణ, మున్సిపల్ పార్టీ అధ్యక్షులు బీఆర్వీ అయ్యప్పన్, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి తదితరులు పాల్గొన్నారు.

రైతుల్లో అవగాహన పెంచండి: జెసి



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జిల్లాలో మామిడి సీజన్‌లో పక్వానికి వచ్చిన మామిడి పండ్లను మాత్రమే కోసేలా రైతులకు అవగాహన పెంచాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జెసి అధ్యక్షతన, ఛైర్మన్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ.. రైతులు ఉద్యాన పంటల సాగు వైపు మొగ్గు చూపేలా వ్యవసాయ సలహా మండలి సభ్యులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో మామిడి పంటకు గిట్టుబాటు ధర అధికంగా ఉందని, రైతులు మామిడి పంటకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అలాకాక వివిధ రకాల ఉద్యాన పంటలు పండించడం ద్వారా అధికలాభం పొందవచ్చునని తెలిపారు. జిల్లా వ్యవసాయ కమిటీ ఛైర్మన్ మాట్లాడుతూ జిల్లాకు కేటాయించిన వేరుశెనగ విత్తనాలను సకాలంలో పంపిణీ అయ్యేలా అధికారులు చూడాలని తెలిపారు. మామిడి రైతులకు మేలు చేసే విధంగా సమావేశాలు ఏర్పాటు చేసి రైతులకు ఎటువంటి నష్టం కలుగకుండా ఉండే విధంగా గిట్టుబాటు ధరలు కల్పించేలా చర్యలు తీసుకున్న జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్, జెసిలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈవిషయంలో రైతులు కూడా జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు. ఖరీఫ్ 2023 సీజన్ కొరకు సబ్సిడీతో వేరుశనగ, అపరాల విత్తనాలు మే నెలాఖరు నాటికి పంపిణీ చేయుటకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే పచ్చి రొట్ట విత్తనాలు 50 శాతం సబ్సిడీతో ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాలలో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రైతుల పొలాల నుండి మట్టి నమూనాలను సేకరించి వాటి విశ్లేషణ ఆధా రంగా మట్టి పరీక్షల ఫలితాల ఆధారంగా రైతులకు కావలసిన ఎరువులు సరఫరా చేయుటకు తగిన చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని అన్నారు. ఈఖరీఫ్ సీజన్‌లో 957 నమూ నాలను సేకరించి మట్టిపరీక్ష కేంద్రం తిరుపతికి పంపడమై నదని ఫలితాలు అందిన వెంటనే రైతులకు సూచిస్తామని తెలిపారు. గత సమావేశంలో సభ్యులు లేవలెత్తిన ప్రశ్నలకు తీసుకున్న చర్యలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీ కృష్ణ వివరించారు. ఏనుగులు బెడద ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో సోలార్ ఫెన్సింగ్ వేయాలని కోరారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి, ఏపీసీడ్స్ డిఎం సంపత్ కుమార్, జిల్లా పట్టుపరిశ్రమ శాఖ అధికారి శోభా రాణి, పశుసంవర్థకశాఖ అధికారి ప్రభాకర్, ట్రాన్స్కో ఈఈ హరి, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయానికి దళితుల భూమే కనిపించిందా..?

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: తరతరాలుగా అనుభవంలో ఉన్న దళితుల భూమిని వైసిపి కార్యాలయం కోసం తీసుకోవడంపై బిఎస్‌పి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములు కేటాయించకుండా జిల్లా కేంద్రంలో వైసిపి కార్యాలయం కోసం దళితుల భూమి తీసుకోవడం ఏమిటని బిఎస్‌పి నాయకులు ముట్టుకూరు జగపతి ప్రశ్నించారు. శుక్రవారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇరువారానికి చెందిన మాజీ కౌన్సిలర్ రాజేశ్వరి కుటుంబం సాగు చేసుకుంటున్న భూమిని చిత్తూరు ఎంఎల్‌ఏ ఆరణి శ్రీనివాసులు పార్టీ కార్యాలయం పేరుతో రెవెన్యూ, పోలీస్‌ల అండతో ఆక్రమించుకోవడం అన్యాయమన్నారు. బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

పేదల ఆకలి తీర్చడమే అన్నా క్యాంటీన్ లక్ష్యం



ప్రజాశక్తి-పలమనేరు: పేదల కడుపు కొడుతూ వారి నోటికాడి కూడు లాగేయడం వైకాపా పని అయితే, పేదల ఆకలి తీర్చాలనే లక్ష్యంతోనే తెలుగుదేశం పార్టీ అన్నా క్యాంటీన్లను ప్రారంభించిందని పలమనేరు పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. పలమనేరులో అన్నా క్యాంటీన్ ను పునః ప్రారంభించి 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ వద్ద శుక్రవారం ఆ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. మొదటగా ఎన్టీఆర్ విగ్రహానికి పూజలు చేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భారీగా బాణసంచా పేలుస్తూ కేకును కట్ చేసి పలువురికి పంచిపెట్టారు. అనంతరం మాజీ మంత్రి అమర్‌నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నా క్యాంటీన్ నిర్వహణకు తోడ్పడిన పలువురు దాతల సేవలను కొనియాడడంతో పాటు క్యాంటీన్ నిర్వాహకులను సన్మానించారు. ఇక యధావిధిగా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తదనంతరం నాయకులు ఆర్బిసి కుట్టి, నాగరాజు, సుబ్రమణ్యం గౌడ్‌లు ప్రసంగించారు. పేదల కడుపు నింపే ఓ మంచి కార్యక్రమానికి తెలుగుదేశం ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అయితే వైకాపా ప్రభుత్వం ఆ కార్యక్రమాన్ని మొదట్లోనే నిర్వీర్యం చేయడం బాధాకరం అన్నారు. పలమనేరులో మాజీ మంత్రి అమర్‌నాథ్ రెడ్డి చొరవ తీసుకొని ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళున్నారని, భవిష్యత్తులోనూ ఈ కార్యక్రమం మరింత పెద్ద ఎత్తున చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్, మురళి, గణేష్, రెడ్డి శేఖర్, అమరనాథ రెడ్డి, హరి, సుధాకర్, రవి, సుబ్బు, రామూర్తి, పర్వీన్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు



ప్రజాశక్తి-యాదమరి: ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని చిత్తూరు క్లస్టర్ ఏపీడీ సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని పెరుమాలపల్లి నుంచి పూల కండ్రిగ గ్రామం వరకు జరుగుతున్న ఫీడర్ ఛానల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన కూలీలతో మాట్లాడుతూ వేతనాలు సక్రమంగా అందుతున్నాయా, కూలి గిట్టుబాటు అవుతుందా అని అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఉపాధి కూలీల సంఖ్య చాలా తక్కువగా ఉందని కూలీల సంఖ్యను పెంచాలని సిబ్బందికి సూచించారు. జాబు కార్డు కలిగిన ప్రతి ఒక్క కుటుంబానికి ఉపాధి పథకంలో పనులు కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. గ్రామాల్లో కూలీలకు అవగాహన కల్పించి పనులు కల్పించే విధంగా ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు బాధ్యతగా పనిచేయాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రోజుకు రెండుసార్లు ఉపాధి కూలీలు పనులు చేస్తున్న ఫోటోలను అప్లోడ్ చేస్తేనే ఆరోజు కూలి వేతనం బిల్లులు నమోదవుతుందని తెలిపారు. కూలీల హాజరును ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లు పర్యవేక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ బాల, టెక్నికల్ అసిస్టెంట్లు మధు, మనోహర్, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

రక్తపరీక్షలపై శిక్షణ



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బైరెడ్డిపల్లి, తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఎంఎల్‌హెచ్‌పిలకు వైద్యులు విజయ చందర్, అరుణ్ కుమార్ అధ్యక్షతన శుక్రవారం ల్యాబ్ టెక్నీషియన్ జిలాని శాలిస్ పద్ధతిలో హిమోగ్లోబిన్ రక్తం పర్సంటేజ్ టెస్ట్ గురించి వివరిస్తూ రక్తం పర్సంటేజ్ ఎలా కనుక్కోవాలో ఎంఎల్‌హెచ్‌పీలకు ట్రైనింగ్ ఇచ్చారు. అనంతరం వారు ప్రాక్టీస్ చేసి నేర్చుకున్నారు. కార్యక్రమంలో బైరెడ్డిపల్లి, తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఇబ్బంది పాల్గొన్నారు.

రక్తహీనతపై అవగాహన

ప్రజాశక్తి-శాంతిపురం: గర్భిణులలో రక్తహీనత కారణంగా అనారోగ్యానికి గురవకుండా ఏఎన్ఎంలు, ఎమ్ఎల్‌హెచ్‌పిలు వారికి అవగాహన కల్పించాలని శాంతిపురం మండల వైద్యాధికారి వంశీకష్ణ తెలిపారు. శుక్రవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పిలకు రక్తహీనతపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్, జిల్లా వైద్యాధికారి ప్రకాశం ఆదేశాల మేరకు రక్తహీనత బారిన పడి అనారోగ్యం పాలవుతున్న గర్భిణులకు రక్తహీనతపై అవగాహన కల్పించి వారిని చైతన్యవంతులు చేయాలని కోరారు. డాక్టర్ ప్రసాద్, సిహెచ్ఓ లతీఫ్ ఖాన్, సూపర్‌వైజర్లు కోదండపాణి, శశికళ, ఏఎన్ఎంలు సరస్వతి, వల్లెమ్మ, అరుణ, జ్యోతి, పుష్ప, గ్రేటా ఎంఎల్‌హెచ్‌పిలు కావ్య, ఆశాలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



ప్రజాశక్తి-సోమల: మండలంలోని అన్నెమ్మగారి పల్లి గ్రామంలో వారం రోజుల ముందు బోరు మోటారు మరమ్మతుకు గురికావడంతో పైపులు మోటారు బోరు నుంచి వెలుపలికి తీసి మోటారు బాగు చేసి నూతన పైపులను బోర్‌లోకి దించడం జరిగిందని, దీంతో తాగునీటి సమస్య పరిష్కారమైనట్టు సర్పంచి వనజమ్మ శుక్రవారం తెలిపారు. వైసీపీ నాయకులు రమణారెడ్డి, ఉపసర్పంచి సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి లలిత కుమారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మోడల్ స్కూల్‌లో 2023–24 సంవత్సరం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఉచిత ప్రవేశానికి ఆన్‌లైన్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీలో విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ అనిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మోడల్ స్కూల్‌లో బోధనా మాధ్యమం ఆంగ్లంలో ఉంటుందని తెలిపారు. ఇక్కడ విద్యకు ఎటువంటి ఫీజులు వసూలు చేయబడవన్నారు. జిల్లా ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేయడానికి ముందుగా వివరాలతో కూడిన సమాచారానికి http:apms.ap.gov.in/apms వెబ్‌సైట్ చూడాలని తెలిపారు. ఈ సదవకాశాన్ని మండలంలోని టెన్త్ పాసైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కిసాన్ డ్రోన్స్ వినియోగంపై అవగాహన



ప్రజాశక్తి-గుడిపల్లి: కుప్పం నియోజకవర్గంలోని గుడిపల్లి, శాంతిపురం, కుప్పం, రామకుప్పం మండలంలోని రైతులకు కుప్పం మండలంలోని చందం గ్రామంలో చామంతి, వరి, మామిడి తోటలలో, గరుడ కంపెనీ డ్రోన్ ద్వారా పురుగుమందుల పిచికారి చేసి రైతులకు, ఆర్‌బీకే సిబ్బందికి క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా కిసాన్ డ్రోన్స్‌ను రైతులు గ్రూపుగా ఏర్పాటు చేసుకుని వ్యవసాయ శాఖలో గ్రాడ్యుయేషన్ చేసిన వాళ్లు ఆ గ్రూపులో ఉంటే 50% రాయితీ, ఇతర రైతు గ్రూపులు 40% రాయితీతో పొందవచ్చునన్నారు. ఈ డ్రోన్స్ ద్వారా ఒక ఎకరా పొలంలో పది లీటర్ల మందు కలిపిన నీటితో ఎనిమిది నిమిషాలలో పూర్తి చేయవచ్చునని తెలిపారు. ప్రజాప్రతినిధులు, రైతులు, నాలుగు మండలాల వ్యవసాయ అధికారులు, రైతు భరోసా సిబ్బంది, సోలిస్, గరుడ కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: డ్రోన్ సహాయంతో వ్యవసాయ పంటలకు ఎరువు పిచికారిపై మండలంలోని ఆర్‌బికె సిబ్బందికి కోలమాసనపల్లి గ్రామ వ్యవసాయ పొలాల్లో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల ఏవో మునికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. మండల, సచివాలయాల వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నేరాలు-ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య



ప్రజాశక్తి-పులిచెర్ల: గుర్తుతెలియని వాహనం కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పులిచెర్ల మండలం కల్లూరు నాలుగు రోడ్ల కూడలిలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పాకాలకు చెందిన జగదీష్ కుమార్ ముగ్గురాళ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. 12 ఏళ్ల క్రితం నవనీతను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. రెండేళ్లు వీరి కాపురం సజావుగా సాగింది. అనంతరం జగదీష్ కుమార్ తాగుడుకు బానిసై భార్య నవనీతను హింసించేవాడు. మూడేళ్ల క్రితం జగదీష్ కుమార్ ఆత్మహత్యకు ప్రయత్నించి చిన్నపాటి గాయలతో బయటపడ్డాడు. వారం రోజుల క్రితం భార్యతో గొడవపడి ఇంటి నుంచి బయటకు వచ్చేశాడు. గురువారం రాత్రి జీవితంపై విరక్తి చెందిన జగదీష్ కుమార్ కల్లూరు నాలుగు రోడ్ల కోడలిలో గుర్తుతెలియని వాహనం కిందపడి మృతి చెందినట్లు మృతుని భార్య తెలిపిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సారా విక్రేత అరెస్టు



ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని సిఆర్ కండ్రిగ గ్రామంలో నాటు సారా అమ్ముతున్న మహిళను అరెస్టు చేసినట్లు వెదురుకుప్పం ఎస్సై లోకేష్ తెలిపారు. శుక్రవారం ఎస్సై మీడియాకు తెలిపిన వివరాలు.. మండలంలోని సిఆర్ కండ్రిగ గ్రామానికి చెందిన వనెమ్మ (45) నాటుసారా అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో తమ సిబ్బందితో కలిసి ఆ గ్రామానికి వెళ్లి నాటు సారా స్వాధీనం చేసుకుని విక్రేతను అరెస్టు చేసినట్టు తెలిపారు.

అక్రమ మద్యం రవాణా కేసులో వ్యక్తి..



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గవర్నమెంట్ బోర్డు వెహికల్ ముసుగులో కర్ణాటక మద్యంతో పాటు అక్రమ రవాణాకు వాడిన కారును స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. గంగాధర నెల్లూరు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం మధ్యాహ్నం విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ చిత్తూరు నగరంకు చెందిన రూప్‌సాగర్ కర్ణాటక నుంచి గవర్నమెంట్ వెహికల్ పేరుతో బోర్డు పెట్టుకుని అక్రమంగా మద్యం తరలిస్తూ మండలంలో అమ్మకాలు సాగిస్తున్నారని సమాచారం అందడంతో జిల్లా ఎస్పీ రిశాంత్ రెడ్డి ఆదేశాల మేరకు చిత్తూరు సర్కిల్ సిఐ గంగిరెడ్డి, స్థానిక ఎస్సై రామాంజనేయులు, ఎస్ఆర్.పేట ఎస్ఐ వెంకట సుబ్బమ్మలతో కలిసి పుత్తూరు– చిత్తూరు మార్గంలో ఠానా మలుపు వద్ద శుక్రవారం ఉదయం వాహనాలను తనిఖీ చేపట్టారు. అదే సమయానికి ఓ కారులో కర్ణాటక మద్యం తీసుకురావడాన్ని గుర్తించి 3,360 టెట్రా ప్యాకెట్లను కారుతో సహా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కారు నడుపుతున్న రూప్ సాగర్ అనే వ్యక్తిని అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నారు. అక్రమ మద్యం విలువ రూ.94,012ల, కారు విలువ రూ.10లక్షలు ఉంటుందని తెలిపారు. అనంతరం ఈ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. అక్రమ రవాణాను పట్టుకున్న పోలీసులకు రివార్డు నగదును డీఎస్పీ అందజేశారు.

జనసేన పాదయాత్ర విజయవంతం



ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపలంలో జనసేన ఇన్‌ఛార్జ్ యుగంధర్ పొన్న ఆధ్వర్యంలో శుక్రవారం రెండవ రోజు పాదయాత్ర విజయవంతంగా ముగిసింది. దారి పొడవునా ప్రయాణికులు, ప్రజలు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా యుగంధర్ పొన్న మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి అసమర్థతతోనే కార్వేటినగరం నుంచి కొత్తపల్లి మెట్ట వరకు రోడ్డు వెడల్పు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ఆరు మండలాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులు, జిల్లా కమిటీ నాయకులు పాల్గొన్నారు.

అందుబాటులో సబ్సిడీ వేరుశనగ విత్తనాలు

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలానికి ఖరీఫ్ 2023కి సంబంధించి వేరుశనగ (కె 6) రకం విత్తనాలు 1950 క్వింటాళ్లు కేటాయించినట్టు మండల వ్యవసాయ అధికారిణి రఖిబా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేరుశనగ క్వింటాల్ పూర్తి ధర రూ.9,300 సబ్సిడీ రూ.3720. రైతులు క్వింటాల్ వేరుశనగ విత్తనాలు రూ.5580 కాగా 30 కేజీల బస్తా 40% రాయితీ పోను రూ.1674లు చెల్లించాలన్నారు. వేరుశనగ విత్తనాలు మండలంలోని ఆర్‌బికెలలో వచ్చాయని రైతులు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే పంపిణీ చేస్తామన్నారు. అలాగే పచ్చిరొట్ట విత్తనాలు, జనుము జీలుగ 50% రాయితీతో ప్రతి రైతు భరోసా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని కావాల్సిన రైతులు వారి పట్టాదారు పాస్ పుస్తకంతో రైతు భరోసా కేంద్రంలో సంప్రదించి తీసుకోవాలని తెలిపారు.

సూర్య, చంద్రప్రభలపై వేణుగోపాలుడు

ప్రజాశక్తి-కార్వేటినగరం: రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం సంతాన వేణుగోపాలుడు పశుపాలకుడైన శ్రీకష్ణునిగా జీవకోటికి వెలుగును ప్రసాదించే దినకరుడిపై విహరించారు. రాత్రి చంద్రప్రభ వాహనంపై భక్తులను కటాక్షించారు. డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ మోహన్, సూపరింటెండెంట్ రమేష్‌బాబు, ఆలయాధికారి సురేష్ కుమార్, కంకణ భట్టాచార్యులు, గోపాలాచార్యులు, దశరథి, కిరణ్‌భట్టాచార్యులు పాల్గొన్నారు.

పుస్తకాలతోనే విజ్ఞానం

ప్రజాశక్తి-సోమల: పుస్తకాలతో విజ్ఞానం పెరుగుతుందని గ్రంథాలయ అధికారి రామకృష్ణ అన్నారు. గ్రంథాలయాలలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమాలలో విద్యార్థులు చురుగ్గా పాల్గొని పత్రికలు, పుస్తకాలు, కథల బుక్కులు చదవడం చేస్తు న్నారు. మండల కేంద్రంలోని గ్రంథాలయంలో శుక్రవారం పలు వురు విద్యార్థులు గ్రంథాలయంలోని నీతికథల పుస్తకాలను శ్రద్ధగా చదువుతూ తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవడం కనిపించింది.